# మోసపోయిందెవరు?

"ప్రమద"

"స్వర్ణా" అని కూరలసంచి అక్కడపడేసి పిలిచాను. లోపలినుండి జవాబులేదు. మళ్ళీ పిలిచాను.

"వస్తున్నానండి. ఎందుకట్లా కేకలేసుకుంటారు?" అంది లోపలినుండివస్తూ.

"అది సరే! మిమ్మల్ని "స్వర్ణ" అని పిలవద్దని ఎన్నిసార్లు చెప్పాను." అంది జడ్జీలాగ.

"నేను లెక్కపెట్టలేదు."

"సరే. ఈ సారినుండి నన్ను 'లత' అని పిలవండి" అంది.

"నే పిలవను. ఎందుకు పిలవాలి?" అన్నాను.

"కాదండి! మీ చేత 'లత' అని పిలిపించుకోవాలని నాకు మనసుగా ఉంది." అంది దగ్గరకు వచ్చి పైసర్దుతూ.

"అబ్బే! నిన్ను స్వర్ణా అని పిలవాలని నాకెంత కాలమునుండి ఉందో నీకు తెలుసా?" అన్నాను.

స్వర్ణకి బుగ్గలు ఎరుపెక్కాయి.

"నా కదంతా తెలీదు. నన్ను 'లత' అని పిలవండి. అలా పిలుస్తారా సరే. లేదా ఇవ్వాళే మా ఇంటికి వెళతాను."

"నిక్షేపంగా పో"

"అయితే పోతాను. ఇక్కడ ఒక్క క్షణం కూడ ఉండను." కోపంకొద్దీ ఏంచెయ్యలేక ఇంట్లోకి వెళ్ళిపోయింది విసురుగా.

ఇది మా ఇంట్లో ప్రతిరోజు సాధారణంగ జరుగుతునే ఉంది. ప్రతిసారి స్వర్ణ తను పుట్టింటికి పోతానని బెదిరించటముతప్ప పోలేదు. ఈ సారి అలాగే అనుకున్నాను. కాని కథ అడ్డము తిరిగింది. స్వర్ణ పెట్టె తీసికొని వెళ్ళిపోయింది.

ఈ గొడవ మా పెళ్ళికాకమునుపే ఉంది. స్వర్ణ నాకు మరదలవుతుంది. చిన్నప్పట్నించి స్వర్ణకు 'లత' అని నాచేత పిలిపించుకోవాలని ఉండేది. నేనెప్పుడు "స్వర్ణా" అనే పిలిచేవాడిని. స్వర్ణకి కోపమువచ్చేది. "పెళ్ళికాని చెప్తా" అన్నట్టు నావంక సీరియస్‌గా చూసేది. అదిచూసి నేను, మా బావమరది నవ్వుకునేవాళ్ళము.

స్వర్ణ వెళ్ళిపోయేటప్పటికి నాకేమితోచలేదు. పైగ ఆ రోజు ఆదివారమయింది. సరదాగ వంట స్వయంగ చేద్దామనుకున్నాను. నా అవస్థ భగవంతుడికెరుక!

చేతులు కోసుకున్నాయి; కాలేయి. కూరలో ఉప్పులేదు. ఎట్లాగో నేను కాబట్టి సరిపెట్టుకుని అన్నముతిని పేపరు చదువుతు వాకిట్లో కూర్చున్నాను. తలుపులేసి కాసేపటికి నిద్రపోయాను.

నిద్రలేచేసరికి నాలుగయింది; స్నానముచేసి డ్రెస్‌చేసికుని కాఫీకి బయలుదేరాను. కాఫీత్రాగి బయటకొస్తుంటే భాస్కరం కనపడ్డాడు. "రారా! కాసేపు చస్ ఆడుకుందాము" అని తీసికెళ్ళాడు మా ఇంటికి.

ఇల్లు తాళము తియ్యటముచూసి "చెల్లాయి లేదేరా!" అన్నాడు. నవ్వుతూ విషయమంతా చెప్పేను. వాడు కాసేపు ఆలోచించి, "ఉండ్రా! చెల్లాయిని ఇక్కడకు వచ్చేట్టు చేస్తాను. నీవేమి

"గాథరాపడక!" అని నా చెవిలో ఒక ఉపాయము చెప్పాడు.

ఆ రాత్రి భోజనానికి భాస్కరం వాళ్ళింటికే రమ్మన్నాడు. నేను "సరే"నని వాళ్ళింటికి వెళ్ళాను.

మరునాడు నా చేత వారమురోజులు శలవు పెట్టించాడు ఆఫీసుకి. వాడు వారమురోజులు శలవు పెట్టాడు. నా చేతికి కట్లుకట్టాడు. తలకికూడ కట్లు కట్టాడు. నన్ను ఒక రోగిలాగ చేశాడు.

అనుకున్నట్టుగానే మరునాడు స్వర్ణ వచ్చేసింది తండ్రితో. రాగానే, ఆదుర్దాగ, "ఏమండి ఎలా ఉంది? ఏం జరిగింది?" అంది.

"ఎలా ఉంటే నీకేమి? నా ఆరోగ్యమే నీకు కావలసివస్తే నన్నొదలిపోతావా?" అన్నాను విరక్తిగ.

"క్షమించండి. అప్పుడేదో ఆవేశంలో చేశాను. ఇంకెప్పుడు ఇలా చెయ్యను. నా వైపు చూడండి." అంది జాలిగ బ్రతిమాలుతూ.

కాని నేనావైపు చూడలేదు. ఇంకా ఇటువైపుకి తిరిగాను.

"అట్లా అనకు నాయనా! ఏదో పొరపాటున తప్పుచేస్తే ఇదేనా నువ్వు దానికి విధించేశిక్ష. దాన్ని క్షమించు" అన్నాడు మా మామయ్య.

"నీకు తెలీదు ఊరుకో మామయ్యా. దాన్ని నా ఇంట్లోంచి వెళ్ళమను—నాకు కామేశ్వరరావుగారిపిల్ల నీయటానికి నిశ్చయించారు."

"ఎవరు. మా చెల్లెలేనా?"

"ఊ! నేను ఒప్పుకున్నాను." అన్నాను.

"ఏమండి, రెండో పెళ్ళి చేసికుంటారా?" అంది స్వర్ణ ఆశ్చర్యంగ.

"అవును," అన్నాను.

"ఏమండీ! మీకిది న్యాయమా? నను వదలి మరో పెళ్ళి చేసికుంటారా?" అంది స్వర్ణ జాలిగ.

"అవునని ఎన్నిసార్లు చెప్పాలి" అన్నాను.

ఇంతలో కామేశ్వరరావుగారి అమ్మాయి సుజాత వచ్చింది.

"ఎవరు నాయనా ఈమె." మామయ్యకి ఇది నిజమేనేమో అని భయమేసింది.

"కామేశ్వరరావుగారి కూతురు" భాస్కరం సమాధానం చెప్పేడు.

"ఆ!" అంటూనే మామయ్య క్రిందపడి పోయాడు.

నేను రోగిగా ఉన్నాననే మరిచిపోయి ఆయన దగ్గరకి పరుగెత్తాను. ఆయన్ని మంచముమీద పడుకోబెట్టాము.

"ఆయనకేమయింది?" అంది సుజాత, జ్ఞాపకమువచ్చి గబగబ పక్కమీదకువెళ్ళి పడుకున్న నాకు దుప్పటి కప్పుతూ

భాస్కరం చెప్పాడు.

"మీకెలా ఉందండి. ఏమయింది?" అంది సుజాత.

"ఏముంది. చెల్లెమ్మ వెళ్ళగానె వీడికి తల తిరిగిందిట. మేడమీదనుంచి దిగుతున్నాడు. మెట్ల మీదనుంచి జారిపడిపోయాడు. అప్పుడు సుజాత నాన్నగారు ఏదో పనిమీద ఇక్కడకొచ్చి, వీడ్ని పక్కమీదకుచేర్చి, సంగతి తెలుసుకుని, కూతుర్ని ఇస్తానన్నాట్ట. వీడొప్పుకున్నాడు."

"అబద్దాలాడినా నమ్మేట్లు ఉండాలి" అన్నారు కామేశ్వరరావుగారు లోపలికివస్తూ.

"మా గుండెలు లటలట కొట్టుకున్నయి."

"సంగతంతా నాకు తెలిసింది. స్వర్ణని రప్పించటానికి మీ రాడిన నాటకము మీ మామయ్యకి తెలుసు. అయినా మిమ్మల్ని ఏడిపించటానికి అట్లా పడిపోయినాడు" అని, "లేరా, ఇంకెంతసేపు పడుకుంటావు" అన్నాడు.

అప్పుడు తెలిసింది వాళ్ళిద్దరు స్నేహితులనీ మమ్మల్ని ఏడిపిద్దామనుకున్నారని. నోరు మూసుకుని ఊరుకున్నాము.

ఆ మరునాడు పొద్దునే ఆఫీసుకెడుతూ!

"వెళుతున్నా లతా" అన్నాను ఈ సారి.

"కాదు స్వర్ణా అనండి" అంది స్వర్ణ వంటింట్లో అస్పష్టంగ.